

## మాఫీ కోసం తిరిగి తిరిగి సస్తున్నం

మేము పెద్దవంగర బ్యాంకులో రూ.30వేలు పంటరుణం తీసుకున్నం. ఇప్పటివరకు మాఫీ కాలే. బ్యాంక్ పెద్ద సారు వ్యవసాయ అధికారులను కలువమని చెప్పిండు. వాళ్లు ఎక్కడ ఉంటరో తెల్వక తిరిగి తిరిగి సస్తున్నం. మా ఆయన తాటి చెట్టు పైనుంచి పడి నడవలేని స్థితిలోఉన్నడు.పెద్దవంగరలోని రైతు వేదిక వద్దకు పొమ్మని కొందరు చెప్పిండ్రు. అది చాలా దూరం. అక్కడికి ఆటోలు పోవు. ముసలోళ్లం నడవలేక ఇంటికే పోతున్నం. అధికారులు మాలాంటోళ్ల ను చూసి ఆదుకోవాలి.

**- బొమ్మెర రాములు, వెంకటమ్మ చిన్నవంగర, మహబూబాబాద్ జిల్లా**

## 1.20 లక్షల రుణం మాఫీ కాలె..



నాకు ఎకరం పొలం ఉన్నది. మాచిరెడ్డిపల్లి సొసైటీలో రూ.1.20 లక్షలు అప్పు ఉన్నది. అందరి మాదిరి గానే నాకు కూడా రుణమాఫీ అవుతుందని ఆశగా ఎదురు చూసిన. సొసైటీకి వెళ్లి చూసేసరికి రుణమాఫీ లిస్టులో నా పేరు లేదు. ఇప్పుడు నేనేమి చేయాలో అర్థం కావడం లేదు.

**-నాంచారి దేవయ్య, మాచిరెడ్డిపల్లి, మం: కోహీర్, జిల్లా సంగారెడ్డి**

## ఐటీ లేదు.. మాఫీ లేదు



నేను పెద్దపల్లి ఇండియన్ బ్యాంకుల రూ.1.20 లక్షల క్రాప్‌లోన్ తీసుకున్న. ఈ ఏడాది ఫిబ్రవరిల వడ్డీ కట్టి రెన్యువల్ చేయించిన. రెండో విడత లిస్టుల నా పేరు లేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే సరైన సమాధానం లేదు. నాకు తెల్లరేషన్ కార్డు ఉంది. ఐటీ లేదు. మరి ఎందుకు మాఫీ కాలేదో తెలుస్తలేదు.

**-కే సారయ్య, రైతు, రంగంపల్లి, పెద్దపల్లి జిల్లా**

## మూడో విడతలో అయితదని చెప్తుండ్రు



నేను యూనియన్ బ్యాంకు నుంచి రూ. 1,36,000 పంట రుణం తీసుకున్న. రెండో విడత లిస్టుల పేరు రాలేదు. అకౌంట్ హోల్డ్‌లో ఉందని బ్యాంకు మేనేజర్ చెప్పిండు. వ్యవసాయ అధికారులను అడుగమన్నడు. చందుపట్ల రైతు వేదికలో ఏఈవోను అడిగితే ఆధార్ నంబర్ కొట్టి పంపుతున్నా. మూడో విడతలో వస్తదిపో అన్నడు. ఎందుకు ఆగిందో తెల్వట్లేదు. **- చెట్టుపల్లి రమేశ్, గోరెంకలపల్లి, నకిరేకల్ మండలం**

## లిస్టుల పేరు లేదట



నాకు ఐదు ఎకరాలున్నది. కెనరా బ్యాంకుల లక్ష పది వేల లోన్ తీసుకున్న. రేవంత్ సర్కారు ఇయ్యాళ లచ్చన్నర దాకా లోన్లు మాఫీ చేస్తామని చెప్పిండ్రు. ఏమైందని అడిగితే లిస్టుల పేరు లేదంటుండ్రు. ఏం జెయ్యాల్నో అర్థమైతలేదు.

**- లక్ష్మీబాయి, రెంజల్, జిల్లా నిజామాబాద్**



బీఆర్‌ఎస్ శాసన సభాపక్ష కార్యాలయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి. చిత్రంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సంజయ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, పాడి కౌశిక్‌రెడ్డి,తదితరులు

# బీఆర్‌ఎస్‌లోనే బండ్ల

**త్వరలో కేసీఆర్‌ను కలుస్తా : కృష్ణమోహన్‌రెడ్డి ● అసెంబ్లీలో ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు హాట్‌టాపిక్**

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోనే కొనసాగే ఆలోచనతో ఉన్నారు. మంగళవారం ఆయన అసెంబ్లీలోని ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ చాంబర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. అనంతరం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'మనసు ఇక్కడే.. త్వరలో కేసీఆర్‌ను కలుస్తా' అని స్పష్టంచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచిన బండ్ల.. ఇటీవల కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను కలిసిన బండ్ల.. తాను తిరిగి పార్టీలోకి వస్తానని అన్నట్టు తెలిసింది. ఆ సమయంలో అక్కడే ఉన్న మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, సంజయ్, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు 'మళ్లీ మనింటికి రా' అంటూ పలకడం విశేషం. ఆ తరువాత భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ సైతం కేటీఆర్‌ను కలిశారు. ఆ తరువాత ఎమ్మెల్యే తెల్లం తాను పార్టీ మారడం లేదని చెప్పారు.

### ఆ ఇద్దరిది హాట్‌టాపిక్

**ఇటీవల** బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి,తెల్లం వెంకట్రావ్ కేటీఆర్‌ను కలవడం అసెంబ్లీలో హాట్‌టాపిక్‌గా మారింది.కాంగ్రెస్ సీనియర్లు, మంత్రులు పట్టించుకోకపోవడం, హామీలు నెరవేర్చకపోవడం, కనీస గౌరవం ఇవ్వకపోవడంతో పార్టీమారిన ఎమ్మెల్యేలు మనసు మార్చుకున్నారని ప్రచారం. ఇద్దరు ఎమ్మెల్యేలు కేటీఆర్‌ను కలిశారని సమాచారం తెలిసి మంత్రులు ఎమ్మెల్యేలతో మంతనాలు చేయగా, వెంకట్రావ్ యూటర్న్ తీసుకున్నట్టు ప్రచారం.

# ఆగస్టు ఆఖరికల్లా 2లక్షలు మాఫీ

మొదటిపేజీ తరువాయి...



విడత రైతు రుణమాఫీ నిధులను విడుదలచేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మొత్తం 6.40 లక్షల మంది రైతుల రుణ ఖాతాల్లో రూ.6,198 కోట్లు జమ చేస్తున్నట్టు చెప్పారు. రుణవిముక్తి పొందిన లక్షలాది రైతులు తమ ఇండ్లలో పండుగ చేసుకుంటుంటే తన జన్మ ధన్యమైందని అన్నారు. జూలై 18న తొలి విడతగా 11 లక్షల మంది రైతులకు రూ.6,098 కోట్లు మాఫీ చేశామని, మళ్లీ 12 రోజుల వ్యవధిలోనే రెండో విడత కింద రూ.6,198 కోట్లు విడుదల చేశామని చెప్పారు. మొత్తంగా 12 రోజుల్లోనే రూ.12 వేల కోట్ల రుణం మాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కతోపాటు ఆర్థిక శాఖ అధికారుల బృందానికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. రైతు రుణమాఫీకి ఏకకాలంలో రూ.31 వేల కోట్లు కేటాయించి దేశ చరిత్రలోనే కొత్త రికార్డు సృష్టించామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం నెల రోజుల్లోనే రూ.లక్షన్నరలోపు రుణాలను మాఫీ చేశామని, అగస్టులో రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేసి రైతులను రుణ విముక్తులను చేస్తామని చెప్పారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఈ రోజు పండుగ దినం అని, రైతుల గుండెలపై ఉన్న పెద్ద భారం తొలగిపోతుందని పేర్కొన్నారు. ఆగస్టు చివరకల్లా రూ.రెండు లక్షల రుణమాఫీ అమలు చేయబోతున్నామని స్పష్టంచేశారు. త్వరలో పంటల బీమా పథకాన్ని అమలుచేస్తామని వెల్లడించారు. రుణ మాఫీ రెండు దశల్లో కలిపి 17.91 ఖాతాలకు, 16.29 లక్షల కుటుంబాలకు రూ.12,289 కోట్లు విడుదల చేస్తున్నామని చెప్పారు. రైతుబీమా కింద 42 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.1,580 కోట్ల ప్రీమియంను రైతుల తరఫున ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. బ్యాంకర్లు విశాల హృదయంతో రైతులకు సహకరించి వెంటనే రుణాలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేస్తున్నామని చెప్పారు. తమకు రాజకీయ ప్రయోజనాల కన్నా రైతుల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టంచేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

### పాస్‌బుక్ ఉన్న రైతులందరికీ రుణమాఫీ

- రేషన్‌కార్డు, పాస్‌బుక్ లేనివారి ఇండ్లకు వెళ్తాం
- రైతుభరోసాపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు
- పల్లా ప్రశ్నలకు మంత్రి తుమ్మల జవాబు



హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ):పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న ప్రతి రైతుకు రూ.2 లక్షల లోపు రుణం మాఫీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మంగళవారం అసెంబ్లీలో వ్యవసాయ పద్దుపై జరిగిన చర్చ సందర్భంగా బీఆర్‌ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వరరెడ్డి లేవనెత్తిన అభ్యంతరాలపై మంత్రి తుమ్మల స్పందించారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు బ్యాంకుల్లో రైతులకు ఉన్న అప్పుల వివరాలను తెప్పించామని, పాస్‌బుక్‌లు, రేషన్‌కార్డులు లేని రైతుల ఇంటివద్దకు వెళ్లి, వివరాలు సేకరించి రూ.2 లక్షల రుణమాఫీని ఎలాంటి నిబంధనలు లేకుండా అమలు చేసే బాధ్యతను ప్రభుత్వం అమలుచేస్తుందని స్పష్టంచేశారు. రైతుభరోసా పథకాన్ని ఎలా అమలుచేయాలనే అంశంపై ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. నిపుణులు, రైతులు, అధికారులు, ప్రజలతో విస్తృతంగా చర్చిస్తున్నామని వివరించారు. పంట వేసిన రైతుకే రైతుభరోసా ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పంటల బీమా పథకాన్ని కూడా తప్పక అమలు చేస్తామని పేర్కొన్నారు.

## ఒకరి ఆధార్.. మరొకరికి రుణం



నల్లబెల్లి, జూలై 30 : ప్రాథమిక వ్యవసా య సహకార సంఘం అధికారుల నిర్వాకం ఓ మహిళా రైతుకు శాపంగా మారింది. తమ సంఘంలో సభ్యురాలు కానప్పటికీ ఆమె ఆధార్ నంబర్‌ను మరొకరి పేరిట నమోదు చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లిలో మంగళవారం వెలుగుచూసింది. మండలంలోని నందిగామకు చెందిన బాధితురాలు భూక్యా సునీత కథనం మేరకు వివరాలిలా.. భూక్యా సునీతకు నర్సంపేట ఎస్‌బీఐలో ఖాతా ఉండటంతో 55 వేలు పంట రుణం తీసుకున్నది. మొదటి విడతలోనే రుణమాఫీ కావాల్సి ఉన్నా జాబితాలో పేరు లేకపోవడం తో అధికారుల చుట్టూ తిరుగుతున్నది. మంగళవారం నల్లబెల్లి రైతు వేదికలో హెల్ప్ డెస్క్‌కు వెళ్లి ఆరా తీసింది. ఎస్‌బీఐలో రూ. 55 వేలు, జిల్లా సహకార బ్యాంకులో రూ.1.33 లక్షలు, మొత్తం రూ.1.88 లక్షల రుణం ఉండటం వల్ల రుణమాఫీ కాలేదని తెలిపారు. దీంతో నల్లబెల్లి పీఏసీఎస్ సీఈవోను సంప్రదించగా, అదే మండలం బిల్యానాయక్ తండాకు చెందిన భూక్యా సునీత పేరిట ఆధార్ నమోదై ఉన్నట్టు తెలిపారు.తనకు పీఏసీఎస్‌లో ఖాతా లేనప్పటికీ తన ఆధార్ నంబర్‌ను దొంగచాటుగా సేకరించి తన పేరుతో ఉన్న మరొకరికి ఎలా నమోదు చేస్తారని ఆగ్రహం వ్యక్తంచేసింది. తనకు న్యాయం చేయాలని పీఏసీఎస్ ఎదుట ఆందోళనకు దిగింది. కలెక్టర్‌ను కలిసి సరిదిద్దుకోవాలని సిబ్బంది చెప్పడంతో వెళ్లిపోయింది. పీఏసీఎస్ సిబ్బంది ఇలాగే అనేక మంది రైతుల ఆధార్ నంబర్లను ఇతరుల పేరిట నమోదు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు విచారణ చేపడితే అవినీతి డొంక కదిలే అవకాశం ఉన్నట్టు బాధిత రైతులు అంటున్నారు.

## మూసీ పేరిట రేవంత్ సంచులు నింపుకోవద్దా?

- ప్రజాభవన్‌లో మహిళ వ్యాఖ్యలు వైరల్
- రెండు నెలలుగా పెన్షన్లు లేవని ఆగ్రహం



హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ): మూసీ బ్యూటిఫికేషన్ అంచనా వ్యయాన్ని మూడు నెలల్లో లక్ష కోట్లకు పెంచిన సీఎం రేవంత్‌రెడ్డిపై ఓ సాధారణ మహిళ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశం అయ్యాయి. రెండు నెలలుగా తనకు పెన్షన్ డబ్బులు విడుదల కాకపోవడంతో అసహనంతో ఆమె తన గోడు వెళ్లబోసుకున్నది. మంగళవారం బేగంపేటలోని ప్రజాభవన్‌లో జరిగిన 'ప్రజావాణి'లో తన ఇబ్బందులు చెప్పుకున్న క్రమంలో ఆవేదన వ్యక్తం చేసింది. అదే సమయంలో ఓ యూట్యూబ్ చానల్ ప్రతినిధి ప్రజాపాలనపై ఆమె అభిప్రాయం కోరాడు. హైదరాబాద్ సుందరీకరణ, మూసీ ప్రక్షాళన కోసం సీఎం రేవంత్‌రెడ్డి వేల కోట్ల నిధులు వెచ్చిస్తున్నారు కదా.. అని చెప్పగా ఆమె స్పందించింది. 'సంచులు నింపుకోవద్దా? ఉట్టిగనే మందికి వేస్తాడా? ఆయన బాగుపడొద్దా? ఏం చేసైనా పేదోళ్లను ఆదుకోవాలి. మంచి పనులు కూడా చేయాలి. ఎనిమిది నెలలైంది. ఏ పనీ చేయలేదు. బస్సు ఒకటి ఫ్రీ ఇచ్చిండు. రెండు నెలలుగా పెన్షన్లు లేవు. ఆంధ్రాలో మొన్ననే ఎక్కిండు. రూ. 7వేలకు పెన్షన్ పెంచి ఇచ్చిండు. వాళ్లని చూసైనా సిగ్గు రావాలి కదా. రూ. 4 వేలు కాదు, పాత రూ. 2 వేలు అయినా రాలేదు. ఈ హైదరాబాద్ బాగుపడదా?' అని ఆమె తన అసహనం వ్యక్తం చేసింది.

## సీఎం విదేశాలకు వెళ్తే నేను చూసుకుంటా!

- బండ్ల కాంగ్రెస్‌లోనే ఉన్నారు రోడ్ల కోసం ప్రధానిని కలుస్తా
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్తే అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని కాచుకోవడానికి తాను ఉన్నానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన అసెంబ్లీలో మంగళవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్ చాంబర్‌కు వెళ్లినంత మాత్రాన పార్టీలో చేరినట్టు కాదని అన్నారు. కేటీఆర్ కూడా తన కుర్చీ దగ్గరకు వచ్చి మాట్లాడారని, కాబట్టి ఆయన కాంగ్రెస్‌లో చేరినట్లేనా అని ప్రశ్నించారు. ఇదే తరహాలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కూడా కేటీఆర్‌ను కలిసి ఉంటాడని అన్నారు. ఆయన ఎక్కడికీ వెళ్లడని స్పష్టంచేశారు. బీఆర్‌ఎస్ నుంచి ఎల్పీ విలీనం కంటే ఎక్కువమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తారని చెప్పారు. త్వరలో ప్రధానిని కలుస్తానని, రాష్ట్ర రహదారుల కోసం నిధులు అడుగుతానని తెలిపారు. వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీ ఇస్తామని చెప్పారు. ఉప్పల్ - నారపల్లి ఫ్లైఓవర్‌కు త్వరలోనే రీ టెండర్ నిర్వహిస్తామని తెలిపారు. వర్షాకాలంలో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు మరమ్మతులు చేపడుతామని, ఎస్‌ఎల్బీసీ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

## తాగుబోతుల రాష్ట్రంగా మార్చొద్దు

- ఆదాయం కోసం మద్యంపై ఆధారపడటం సిగ్గుచేటు
- బెల్ట్‌షాపులపై భగ్గుమన్న విపక్షాలు
- జవాబు చెప్పలేక నీళ్లు నమిలిన మంత్రి జూపల్లి



హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఎక్సైజ్ ఆదాయాన్ని సుమారు రూ.7 వేల కోట్లకు ఎలా పెంచుతారో అసెంబ్లీకి వివరించలేక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తడబడ్డారు. ఎక్సైజ్ విభాగం పద్దుల సందర్భంగా సోమవారం అర్ధరాత్రి సభలో విస్తృత చర్చ జరిగింది. మద్యంపై ఆదాయాన్ని పెంచి రాష్ట్రాన్ని తాగుబోతుల రాష్ట్రంగా చేయొద్దని విపక్ష పార్టీల సభ్యులు డిమాండ్ చేశారు. ప్రజలకు అధికంగా మద్యాన్ని తాగించే విధానమే మీదైతే.. ఆబ్కారీ శాఖలోని 'ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్'లో మద్య నిషేధం అనే పదాన్ని పూర్తిగా తొలగించుకొని రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యాన్ని అమ్ముకోండని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ గల్లీలో చూసినా బెల్టుషాపు దర్శనమిస్తున్నదని, వాటిని ఎప్పటినుంచి ఎత్తివేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం అమ్మేందుకు చేస్తున్న ప్రయత్నాలు మంచివికావని ఎంఐఎం, బీజేపీ, సీపీఐ, బీఆర్‌ఎస్ సభ్యులు హితవు పలికారు. వివాదస్పద సోం డిస్టిలరీస్‌కు తెలంగాణలో అనుమతులు ఇవ్వడంపై సభలో చర్చ జరిగింది. మధ్యప్రదేశ్ మాజీ సీఎం, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కలిసి ఆ సంస్థను తెలంగాణలోకి తీసుకొచ్చారని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ఇందుకు సెబీ నుంచి తీసుకున్న సమాచారాన్ని జతచేసి మాట్లాడారు. మిగతా కంపెనీలకు ఇచ్చిన అనుమతుల్లో జరిగిన అవకతవకలపై నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

### సాంకేతికంగా పెంచుకుంటాం

గత ఏడాది కంటే రూ.5 వేల కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిపేందుకు బడ్జెట్‌లో పెట్టామని మంత్రి జూపల్లి చెప్పారు. ఇదంతా సాంకేతికంగా సాధ్యం అవుతుందని చెప్పారు. లిక్కర్ తయారీ, బేవరేజెస్ దగ్గర సీసీ కెమెరాలు పెట్టి, వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని, ఎయిర్‌పోర్టులు, చెక్‌పోస్టులు, రైల్వేల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి రూ.5 వేల కోట్లకుపైగా ఆదాయం పెంచుకుంటామని చెప్పారు. ఆ ఆదాయం ఎలా పెంచుకుంటారో వివరణ ఇవ్వలేదు. మంత్రి స్పష్టమైన సమాధానం చెప్పాలంటూ ఒకదశలో బీఆర్‌ఎస్ సభ్యులు పోడియంను చుట్టుముట్టారు. కొంతసేపటి తర్వాత కట్ మోషన్ విత్ డ్రా తీసుకుంటామని హరీశ్‌రావు కోరగా, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం ఇచ్చారు.

## అసెంబ్లీ కెమెరా ఫేడ్‌అవుట్!

- బీఆర్‌ఎస్ నేతల క్లిప్పింగ్స్ వస్తే ఫేడ్ అవుట్
- కాంగ్రెస్ నేతలు క్లిప్పింగ్స్‌కు జూమ్ ఇన్..
- పీసీఆర్ నిర్వాకంపై సోషల్ మీడియాలో విమర్శలు

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో సాంకేతికతను అడ్డంపెట్టుకొని ప్రతిపక్షం గొంతును నొక్కుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైనుంచి ఎలాంటి ఆదేశాలు ఉన్నాయో తెలియదు కానీ.. ప్రతిపక్ష సభ్యులు మాట్లాడేటప్పుడు సాంకేతికతను బాగా ఉపయోగించి, వారిని, వారి క్లిప్పింగ్స్‌ను స్క్రీన్‌పై కనిపించకుండా చేస్తున్నారనే ఆరోపణలు పెరుగుతున్నాయి. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన దగ్గర్నుంచి ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తమను స్క్రీన్‌లో చూపించడం లేదనే ఆరోపణలకు బలం చేకూర్చుతూ అసెంబ్లీ పీసీఆర్ (ప్రొడక్షన్ కంట్రోల్ రూమ్) సిబ్బంది తెలివిగా కెమెరాలను ఆపరేట్ చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చర్చ సందర్భంగా ఏవైనా వార్తా క్లిప్పింగ్స్, రిపోర్టులు, ప్లకార్డులు ప్రదర్శిద్దామని వాటిని టేబుల్‌పైనుంచి తీసేలోపే కెమెరా ఫేడ్ అవుట్ అయిపోతున్నది. సదరు సభ్యుడు ఆ క్లిప్పింగ్, పేపర్ ప్రింట్‌ను మళ్లీ టేబుల్‌పై పెట్టే వరకూ స్క్రీన్ మీద స్పీకర్‌ను మాత్రమే చూపిస్తున్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అలా ఎంతసేపు ఆ క్లిప్పింగ్ పట్టుకుంటే.. అంతసేపూ అవుట్‌పుట్‌లో స్పీకరే కనిపిస్తున్నారు తప్ప.. ఆ పేపర్ క్లిప్‌లో ఉన్న అంశం ప్రజలకు తెలియనివ్వడం లేదు. ఇలా ప్రతీసారిరీ, పదే పదే జరుగుతున్నది. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ క్లిప్పింగ్స్ ప్రదర్శిస్తే.. మాత్రం అవి స్క్రీన్‌పై కనిపించేలా పీసీఆర్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒక్కోసారి ఆ క్లిప్పింగ్స్‌ను జూమ్ చేసి మరీ చూపిస్తున్నారు. ఈ వివక్షపై కొందరు నెటిజన్లు అసెంబ్లీ సీపీఆర్ సిబ్బంది తీరుపై సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. ఇక ప్రతిపక్ష ఎమ్మెల్యేలైతే మా వీడియోలు చూపించండి అంటూ పదేపదే సభలోనే కోరుతున్నారు.

● **బీవోఎం మేనేజర్ నిలదీత**



రుణమాఫీ రెండో విడత జాబితాలో పేర్లు గల్లంతు కావడంతో మంగళవారం రైతులు బ్యాంకు అధికారులను నిలదీశారు. మండలంలోని దీపాయిగూడ, జైనథ్, నిరాల, తరోడా గ్రామాలకు చెందిన 50 మంది రైతులు మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు తరలివచ్చారు. బ్యాంక్ ఎదుట బైఠాయించి బీవోఎం మేనేజర్ గవ్విరెడ్డి శివప్రసాద్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఈ బ్రాంచ్ పరిధిలో 500 మంది రైతులు ఉన్నారని, 2018 నుంచి 2023 వరకు రుణాలను అధికారులు అప్‌డేట్ చేయలేదని మండిపడ్డారు. ఆధార్, పాన్ కార్డులను లింక్ చేయకపోవడంతో నష్టం వాటిల్లిందని ఆవేదన చెందారు. కొందరు రూ.లక్ష తీసుకుంటే రూ.50 వేలు, రూ.50 వేలు తీసుకుంటే రూ.లక్ష ఖాతాలో ఏ విధంగా వేస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపై బీవోఎం మేనేజర్ శివప్రసాద్‌ను అడుగగా.. జాబితాలో తలెత్తిన గందరగోళం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, సాంకేతిక లోపం వల్ల జాబితాలో రైతుల పేర్లు, జమ అయిన డబ్బుల వివరాలు తేడాగా ఉన్నాయని తెలిపారు. - జైనథ్

### నేడు ఆటోకార్మికుల చలో అసెంబ్లీ

హిమాయత్‌నగర్, జూలై 30 : ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం చేపట్టనున్న చలో అసెంబ్లీ కార్యక్రమానికి ఆటోడ్రైవర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం పిలుపునిచ్చారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్ రెడ్డి భవన్‌లో యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రవాణా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటోమీటర్ చార్జీలు పెంచాలని, ఇన్సూరెన్స్ ధరలు తగ్గించాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి యాదగిరి, యూనియన్ నాయకులు కొమురవెల్లి బాబు, భిక్షపతియాదవ్, ఒమర్‌ఖాన్, జంగయ్య పాల్గొన్నారు.

## స్పీకర్‌ను కోర్టు ఆదేశించవచ్చు!

- ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో గండ్ర వాదన
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా



హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): చట్టసభ చైర్మన్ హోదాలో ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోరని సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు హైకోర్టులో వాదించారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం స్పీకర్ ట్రిబ్యునల్ చైర్మన్ బాధ్యతలను నిర్వహిస్తారని చెప్పారు. ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో ఫిరాయింపు పిటిషన్లపై విచారణ చేస్తారని, ఈ నేపథ్యంలో ఆ పిటిషన్ల విచారణ వ్యవహారాలపై కోర్టులు స్పీకర్‌కు ఉత్తర్వులు జారీ చేయవచ్చునని అన్నారు. నిర్దిష్టకాలంలో ఫిరాయింపు పిటిషన్లపై విచారణ పూర్తిచేయాలని సుప్రీంకోర్టు కూడా ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ తరఫున గెలుపొంది కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలను మంగళవారం జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. పిటిషనర్ల తరపున గండ్ర వాదనలు కొనసాగిస్తూ, స్పీకర్ చట్టసభలో తీసుకునే నిర్ణయాలు, బయట తీసుకునే నిర్ణయాలు వేరని చెప్పారు. ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో తీసుకునే నిర్ణయాలకు ఆ నిర్ణయాలకు సంబంధం ఉండదని అన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం స్పీకర్ తన ముందున్న పిటిషన్‌పై నిర్ణయం తీసుకునేలా కోర్టులు ఆదేశాలు జారీ చేయవచ్చునని చెప్పారు. కడియం, దానం తరపున న్యాయవాదులు మయూర్‌రెడ్డి, శ్రీరఘురాం వాదించారు. తదుపరి విచారణ ఆగస్టు ఒకటో తేదీకి వాయిదా పడింది.


SBI

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

అప్లై చేయడానికి QRని స్కాన్ చేయండి

**కాంట్రాక్టు ప్రాతిపదిక న స్పెషలిస్టు అధికారుల నియామకం**

భారతీయ స్టేట్ బ్యాంకు కాంట్రాక్టు ప్రాతిపదిక న క్రింద పేర్కొనిన స్పెషలిస్టు ఉద్యోగాల కొరకు భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరుచున్నది:

| క్రమ సంఖ్య | పోస్ట్ | ఖాళీలు* |
|---|---|---|
| | ప్రకటన నం. CRPD/SCO/2024-25/09 | |
| 1 | సెంట్రల్ రీసెర్చ్ టీం (ప్రొడక్ట్ లీడ్ ) | 2 |
| 2 | సెంట్రల్ రీసెర్చ్ టీం (సపోర్ట్) | 2 |
| 3 | ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (టెక్నాలజీ) | 1 |
| 4 | ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (బిజినెస్) | 2 |
| 5 | రిలేషన్షిప్ మేనేజర్ | 273 |
| 6 | వైస్ ప్రెసిడెంట్ – వెల్త్ | 643 |
| 7 | రిలేషన్షిప్ మేనేజర్ – టీమ్ లీడ్ | 32 |
| 8 | ప్రాంతీయ అధిపతి | 6 |
| 9 | పెట్టుబడి నిపుణుడు | 30 |
| 10 | పెట్టుబడి అధికారి | 49 |

*(బ్యాక్‌లాగ్ ఖాళీలతో సహా)

పైన పేర్కొన్న పోస్టుల వివరాలు 19.07.2024 తేదీ లో కల డిటైల్ అడ్వర్టైజ్మెంట్ నెం. CRPD/SCO/2024-25/09 లో లభించును. అర్హత ప్రమాణాలు (వయస్సు, అనుభవం, ఉద్యోగ ప్రొఫైల్ మొదలైనవి), ఖాళీ వివరాలు, అవసరమైన రుసుము మరియు ఇతర వివరాలు మరియు ఆన్‌లైన్ అప్లికేషన్ లింక్ కోసం, బ్యాంక్ వెబ్‌సైట్ https://bank.sbi/web/careersకి లాగిన్ అవ్వండి. దరఖాస్తు మరియు ఫీజు చెల్లింపు వివరాలతో పాటు అర్హతలని నిర్ధారించు కొనుటకు మరియు పూర్తి వివరాల కొరకు ప్రకటనను చూడండి. ఏవైనా సందేహాలు ఉన్నా, దయచేసి మాకు – "CONTACT US" —> "Post Your Query" లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ (https://bank.sbi/web/careers/post-your-query) లో లభించును.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : **19.07.2024** నుండి **08.08.2024** వరకు.

స్థలం: ముంబయ్
తేదీ: 19.07.2024

మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)